# "నలుగుర్ని పోషిస్తున్నానిప్పుడు"

"అమలాపురము హైస్కూలులో చదివి పద్దెనిమిదో యేట స్కూలు ఫైనలు పాసయేను నేను. స్వగ్రామంలోనే నౌకరీ దొరుకుతుందేమో అని వక సంవత్సరం ప్రయత్నం చేశాను. సంవత్సరము కూడా నాకు శాఖాభేదం అడ్డువచ్చింది. యే డిపార్టుమెంటులోకి వెళ్ళినా ఇదే అడ్డూ. విసువు పుట్టింది. "ఇక యిక్కడ లాభం లేద"నుకున్నాను."

"మా యింటికల్లా వున్నవాళ్ళం మా అమ్మా నేనూను. బీదవాళ్ళం. మా అన్నయ్య బతికి వున్నప్పుడు కొబ్బరికాయల వర్తకం చేసి వున్న కొంప యెగరగొట్టేడు. చివరికి తన పెళ్ళానికి మనువర్తి కూడా దిక్కులేకుండా చేశాడు.. మా వదిన పుట్టింటికి వెళ్ళిపోయింది."

"యిక అరవై యేళ్ళ తల్లీ నేనూ వున్నాము. పరీక్ష అయిదాకా ప్లీడర్లూ, సంపన్నులూ తలో రూపాయీ యిచ్చి పోషించేరు. తరవాత "యిక యేటికి అడ్డుపడవోయి" అన్నారు. మంచిమాటే అన్నారు వారు. ప్రయోజకుణ్ణి కావడానికి పునాది వేసిపెట్టారు వారు. ఆ వుపకారం చాలదూ?"

"వూరు విడిచి పెట్టాలన్నాను. నెల్లాళ్ళు బోధించగా మాఅమ్మ అంగీకరించింది. రెండుకావిళ్ళ సామానుతోటీ రాజమహేంద్రవరం ప్రవేశించాను. మాతాలూకావారు చాలమంది వున్నారు గాదూ యీవూరు ప్లీడర్లలో? అందర్నీ చూశాను. నౌకరీ దొరికిందాకా తలో రూపాయీ యిస్తామన్నారు. వారి ఆశీర్వచనాల వల్ల నెల్లాళ్ళకే నాకు ఆధారం దొరికింది."

"మంచికో చెడ్డకో జన్మభూమి విడిచి పెడితే గాని నాకు ఉపాధి దొరికింది కాదు. పుట్టినవూరు విడిచిపెడితే నేనేమేనా చెడ్డానా? ముక్కవిల్లి సీతారాముడు అమలాపురంలో లేడు. ఇంతే."

"నగరీయసంఘంలో నౌకరీ దొరికింది. యిరవై అయిదు రూపాయల జీతం. పని తెలిశాక అయిదురూపాయలు హెచ్చు చేస్తామన్నారు. యేంలోటూ? స్వార్జితం నెలకి పాతిక రూపాయలు. సంవత్సరానికి మూడువందలు. కాలం గడిచిపోతుంది. ధైర్యం కలిగింది. అట్నుంచి నరుక్కు రమ్మన్నాడు."

"కార్యస్థానానికి దూరం అయినా సుఖంగా వుంటుందని యిన్నీసుపేటలో ప్రవేశించాను నేను. అద్దె నెలకి నాలుగు రూపాయలు. వొక గదీ, వంట వసారా, వీధిగదీని. అసలు అంత అక్కన్నే లేదూ మాకు. అయినా అంతకంటె తక్కువ దొరికింది కాదు. అయితే అయిందనుకున్నాము. నెల్లాళ్ళు దాటిం దగ్గిర్నుంచి అద్దె పైగా దొరికేది."

"ఒకనెల ఆలస్యంగా యిచ్చినా యింటి వారు బాధించేవారు కారు. యింటివారంటే యజమానులికీ మాకూ యేమీ సంబంధం లేదు. నవుడూరి సూరీరావుగారు అని ఒకరు ఆయిల్లంతా పుచ్చుకుని చిన్నభాగం మాకిచ్చారు. సూరీరావుగారిది నరసాపురం. వారిక్కడ బట్టలవర్తకం చేస్తున్నారు. ఆయనా, భార్యా, తల్లీ, పెళ్ళికాని చెల్లెలూ, యింతే వారింట్లో జనం."

"ముసలావిడ కంటే కోడలు మంచిదీ. కోడలు కంటే కొడుకు మంచివాడు. చిన్నపిల్ల అందరికంటే మంచిదీ. పైగా నాదగ్గిర చదువు కూడా మొదలుపెట్టింది. కూతురు చదువు మొదలుపెట్టేక తల్లి ధుమధుమలు తగ్గేయి."

## ②

"సంవత్సరం గడిచింది. ఆరుమాసాల కిందటే జీతం ముప్ఫయిరూపాయ లయింది. సాదరు పైగా వెళ్ళిపోతూంది. మాఅమ్మ పొక్తు అయిన మనిషి. కనక నెలకి ఆరు రూపాయలు మిగిల్చింది. మొత్తానికి సంవత్సరం గడిచేటప్పటికి సంసారపు చిల్లర లోట్లు తీరగా నూరు రూపాయలు నిలవ చూపించింది మా అమ్మ."

"యింటివారూ మేమూ వకరి కష్టసుఖాలు వకరు చెప్పుకునేవారం. దాపరికాల్లేవు. ఆ సంవత్సరంలో వారికి మూడువేలు మిగిలేయి. మాకు నూర్రూపాయలు మిగిలేయి. మూడువేలూ - నూరూ - చాలా భేదమే; కాని "పదివేల పెట్టుబడి మీద మూడువేల మిగులూ. మీకు పెట్టుబడిలేని మిగులూ. తేడా తెలిసిందా" అన్నారు సూరీరావు గారు."దగ్గిర వుంటే యేంలాభం? ఫాయిదా నష్టం చేసుకోవడం మంచిదా? సందేహం యేమీ లేకపోతే మాకాతాలో జమకట్టుకోండి" అని కూడా వారనగా "బాగుంది" అని మా అమ్మ రూపాయలు వారికిచ్చింది."

"సూరీరావు గారికి వడిదుడుకుల్లేవు. మహానిదానం అయినవారు. బేరంలో యేమాత్రం లాభం కనపడ్డా విడిచిపెట్టరు. "అసలు నష్టం రాకపోతే లాభంలోనే జమ. అందులో కాస్తో కూస్తో మిగిలేటప్పుడు ఆలోచన యెందుకూ?" యిదీ వారి పద్ధతి."

"ఒకనాడు రాత్రి భోంచేసి తొమ్మిదిగంటల వేళ యిద్దరమూ గోదారికి వెళ్ళి వెన్నెట్లో యిసకతిప్పమీద కూచున్నాం. లోకాభిరామాయణంలో నుంచి వర్తక ప్రసంగంలో పడ్డాం. "బావగారూ, ముందేమవుతుందో చెప్పలేను. మనస్సు యెందుకో వురకలు వేస్తోంది. యేమయినా సరే. అప్పుతెచ్చి యింకో పదివేల రూపాయల సరుకు కొనేస్తానండీ" అన్నారు. భయం తోచింది నాకు. "మీ ధైర్యానికి కారణం తెలవదు. ఆ వ్యాపారంలో వుండే రహస్యం అసలే తెలవదూ.

నా సలహా యేమీ లేదు. నిదానించి చెయ్యండి" అన్నాను నేను. "యిక వెనుకంజ లేదు" అని వారు లేచారు. యిద్దరమూ యింటికి వెళ్ళిపోయాము."

"మర్నాడే యెవరో మెరకవీధి తెలగాల దగ్గిర పదివేలు తెచ్చి వారు మద్రాసూ, బొంబాయీ వెళ్ళేరు."

సరుకు ఆగస్టు మూడో తేదీని కొట్టుకు చేరింది. నాలుగో తేదీని "మనస్సు గజగజ లాడుతోందండీ" అన్నారు సూరీరావుగారు. అయిదో తేదీని నేనూ వారూ కలుసుకోలేదు. ఆరోతేదీ వుదయం పదిగంటలికి "కోటలో పాగా వేశానండీ బావగారూ"అని వారు ఉచ్చస్వరంతో చెప్పేరు. "చాలా ఆనందంగా వుంది. అయితే కారణం యేమిటండి?" అని నేనడగ్గా పత్రిక నామీదకి విసిరేశారు. చూడగా యూరోపులో యుద్ధం. ధాంధామ్మని ఫిరంగులు పేలిపోతున్నాయి. ప్రపంచకం అంతా హాహాకారాలు నిండిపోతున్నాయి."

"అక్కడ యుద్ధం ప్రబలిపోయేటప్పటికి యిక్కడ బ్రాహ్మణేతరోద్యమం ముదిరింది. యెక్కడ చూచినా సభలే. యెక్కడ విన్నా బ్రాహ్మణ నిందే. అంతటా బ్రాహ్మణ తిరస్కారమే. నా భవిష్యత్తును గురించి అనుమానం తట్టింది. తినీతినీ వణ్ణము యెక్కడ యెగిరిపోతుందో అని బెంగపెట్టుకున్నాను. "భయపడకండ"న్నారు సూరీరావుగారు. "నౌకరీ మన వృత్తి కాదండీ" అన్నారు. నిజంగా కాకనే పోయింది. వారంరోజులు గడవలేదు మేమిలా మాట్టాడుకుని. "ప్రస్తుతం నువ్వు అవసరం లేదు. నిన్ను తగ్గించాము" అని అధికారి రాశాడు."

"యింకేమిటీ చెయ్యడం? నగరీయసంఘంలో పనికిరాని బ్రాహ్మడు మరోచోట పనికి వస్తాడా? మూడురోజులు ఆలోచించాను. వున్న రెండువందలతోటీ స్వంతవృత్తి యేదేనా పెట్టుకుందామని అనుకున్నాను. మా అమ్మ "బాగా ఆలోచించు" అంది. యిద్దరమూ సూరీరావుగారితో చెప్పేము. "రెండువందలుంటే యింకో వంద నేనిస్తాను. అది మా చెల్లాయి చదువుకోసం మీకీయవలసిన గురుదక్షిణ. మూడువందలతో యేదేనా చిల్లరవర్తకం గాని మంచివ్యాపారం సాగదు. మీకు సందేహం లేకపోతే నేనొక మాట చెబుతాను. నాకు రెండో మనిషి సాయం అవసరంగా వుంది. ప్రతీవాణ్ణీ నమ్మడం కష్టం. పైవాడయితే పన్నెండు రూపాయలకంటే యెక్కువ అవసరం లేదు. అంటే అంతకంటే పెద్దజీతగాడు అక్కరలేదు. మీరయితే యిరవై రూపాయలిస్తాను. యింటికి అద్దె యివ్వక్కర్లేదు కూడానూ మీరు" అన్నారు. నేను తప్పకుండా వుంటాన్నాను. భయంలేదు. "పాతికరూపాయల జీతం అన్నమాట. కాలం గడిచిపోతుంది. చిల్లర్లు అన్నీ సంపాదించుకున్నాం గనక వడిదుడుకులు వుండవు. మాఅమ్మ దాల్లోనే మిగులుస్తుంది. పైగా బ్రాహ్మణ్ణీ కొలవడం. మహారాజా! తప్పకుండా వుంటాన"న్నాను. మా అమ్మ గూడా అలాగే చెప్పింది. "మిమ్మల్ని జీతగాడుగా గాదు వాటాదారుగా చూచుకుంటాన"ని చెబుతూ సూరీరావుగారు నన్ను షాపులోకి తీసుకుపోయారు."

# 3

"మొదటినాడు కొత్త ప్రపంచకంలో పడ్డట్టయింది. రెండోనాడు దిక్కుతేలేనా తెలవలేదు. మూడోనాడు కొంచం దారి కనబడింది. నాలుగోనాడు భరవాలే దనుకున్నాను. వారంరోజులు గడిచాక "యిప్పుడెలా వుంది? యిదేం బ్రహ్మవిద్యటండీ?" అన్నారు సూరీరావు గారు. ధైర్యం కలిగింది, వర్తకరహస్యాలు బోధ అవడం మొదలుపెట్టాయి."

"యెంతభేదమూ? ఆ నౌకరీకి యీ నౌకరీకి పోలికే లేదు. యిది నౌకిరీ అనే తోచలేదు. ఈ నౌకరీలో తయారైన వాడు యెప్పటికేనా యజమానుడు కావచ్చు. ఆ నౌకరీలో యెప్పటికీ నౌకరే."

"నగరీయ సంఘంలో నాతో గూడా వొక క్షత్రియుడూ, వక వైశ్యుడూ పనిచేసేవారు. వారికీ నాకూ స్నేహం. అంతా యిన్నీసుపేటలోనే మకాం అవడం చేత వెళ్ళేటప్పుడు వచ్చాటప్పుడు కలిసేవాళ్ళం. కష్టాలూ సుఖాలూ చెప్పుకునేవాళ్ళం. నా స్నేహం చేత వాళ్ళు బట్టలూ, పాత్రలూ సూరీరావుగారి షాపులోనే పట్టుకొని వెళ్ళేవారు. సంకురాత్రికి పెళ్ళాలకి చీరలు కొనడానికి షాపులోకి వచ్చాటప్పటికి "యేం కావాల"ని అడుగుతూ నేనే చీరల మూట విప్పాను. తెల్లపోయారు వాళ్ళు. "వోయి పిడుగూ యిక్కడ చేరేవటోయి" అన్నారు. "బ్రతికే వోయి, నిజంగా నువ్వ స్వేచ్ఛ పొందేవు" అన్నాడు క్షత్రియమిత్రుడు. "దానికంటే యిదే లాభం. బాగుపడతావ"న్నాడు వైశ్యమిత్రుడు. "మేంకూడా యేమేనా చూచుకుంటాం" అన్నారు యిద్దరూ కలిసి. "త్వరగా కానివ్వండ"న్నాను. బట్టలిచ్చి పంపేశాను."

"మాకొట్టులో వొకదర్జీ వున్నాడు. సాయిబు. మహామంచి పనివాడు. మద్రాసులో తయారై వచ్చాడు. కొత్త పద్ధతులన్నీ బాగా తెలుసును. చొక్కా కుడితే మొలిచినట్లు వుంటుంది. స్వతహాగా మంచివాడు. కూతురు పెళ్ళంటే సూరీరావుగారితో చెప్పి రెండువందలు బదులు యిప్పించాను. అది మొదలు నామీద చాలా విశ్వాసమూ భక్తీ కుదిరేయి. "మహమ్మదూ, దర్జీపని నేర్పుతావుటోయి నాకూ?" అని వోనాడు నేను యాదాలాభంగా అనేటప్పటికి "కానివ్వండ"న్నాడు. "అన్ని పనులూ నేర్చి వుండడం మంచిద"న్నారు సూరీరావుగారు. "నేనుగూడా నేర్చుకుంటాను చెబుతావా?" అన్నారు కూడాను. సాయిబుకి ఉత్సాహం కలిగింది. మర్నాడే మంచిది చూసి మొదలు పెట్టేము."

"రెండు రోజులయేక సూరీరావుగారి చేతిలో సూది గుచ్చుకుంది. వారం రోజులు బాధపడ్డారు వారు. నాలుగు రోజులు కొట్టుకే రాలేదు. నన్ను మానవద్దన్నారు. బాగా నేర్చేవంటే మంచి బహుమతి చేస్తాననేటప్పటికి సాయిబు మరింత విశదంగా చెప్పేడు. ఆడుతూ పాడుతూ రెండు మాసాల్లో అంతా నేర్పేశాడు. పనివాడితనం యెలా వుందో చూద్దామని తాను హొప్పుకున్న రెండు

మంచి కోట్లు నాచేత కుట్టించాడతను. సూరీరవుగారు ఆశ్చర్యపడ్డారు. సాయిబు తెల్లపోయాడు. నాకు బ్రహ్మానందం అయింది. కోట్లు కుట్టించుకున్న వారు "యిలాంటి పనివాడితనం చూడలేద"న్నారు. కోట్లు వారికి పూసినట్లు సరిపోయాయి."

"మర్నాడు భోజనం పెట్టి సాయిబుకి యాభై రూపాయలు బహుమతీ యిచ్చేను."

## ④

"పంతులుగారూ, యీపాటికి మిషను కొనండి" అన్నాడు సాయిబు. సందేహించవద్దన్నారు సూరీరావు గారు. రెండురోజు లాలోచించాను. కొనీదాకా తొందలు విడిపించేడు సాయిబు."

"సూరీరావుగారు ఖరీదు పూర్తిగా యిచ్చేసి కొనమన్నారు గాని నాకలా యిష్టం లేకపోయింది. నెలకి యెనిమిది రూపాయలు యిచ్చే పద్ధతిని యిరవయి రూపాయలు బజానా యిచ్చి కొత్తమిషను తీసుగు వచ్చాను."

"సాయిబు చాలామందిని పంపేశీవాడు. అందంగా వుండాలన్నవాళ్ళంతా అతన్నే కుట్టమంటే అతడి తరామ? కాని నేను మిషను కొన్నాక అన్ని పనులూ పుచ్చుకుని తనకు మిగిలిపోయినవి నాకిచ్చీవాడు."

"మొదటినెల్లో వాయిదా చెల్లించగా పది రూపాయలు మిగిలేయి. రెండోనెల్లో పన్నిండూ, మూడోనెల్లో సంకురాత్రి రావడం చేత ముప్ఫయ్యీ మిగిలేయి. యిదంతా సూరీరావుగారికి గంటల ప్రకారం పనివప్పగిస్తూ చేసింది. వక్క గంటేనా వారికి నాగా రానివ్వలేదు."

"యిలా ఆరుమాసాలు గడిచాయి. మిషను మీద నూటయాభయి రూపాయిలు వచ్చాయి. దర్జీపనివాళ్ళలో నాపేరు పాకిపోయింది. చొక్కాలు కుట్టించుకునీ వాళ్ళలో చాలామంది మా షాపులో గుడ్డకొని నాకే యిచ్చేశీవారు. అందరకంటే యెక్కువ మజూరీ పుచ్చుకున్నా నాకు పని తెరపి లేకుండా వుండీది."

"సూరీరావుగారి ప్రోత్సాహం యెక్కువయింది. స్వదేశి చెక్కులు విశేషంగా వుండడం చేత మా షాపులో అమ్మకం యెక్కువయింది. సాయిబు మిషనుకీ, నా మిషనుకీ గూడా పని మిగిలిపోయీది."

"సూరీరావుగారికి వక్కడే బావమరిది. ఆయన యఫ్యే పరీక్ష యిచ్చి బావమరిది సంపాదన చూసి చదువు మానేసి వర్తకంలో ప్రవేశించాడు. పదివేలు తెచ్చాడాయన. బావమరుదులిద్దఱూ కూడేరు. కొట్టు పెద్దదయింది. అమ్మకం కూడా పెరిగింది."

"సూరీరావుగారు స్కూలుఫైనలు పరీక్ష యిచ్చారు. సుబ్బారావు గారు ఇంటర్మీడియేటులో నెగ్గేరు. దర్జీ సీతారాముడు స్కూలుఫైనల్లో జయం పొందేడు.

కావలిసిందేముంది. పట్ణంలో వుండే విద్యాధికులంతా - సొగసు యెరుగున్న వారంతా మాకొట్టుకి మళ్ళేరు."

"బావమరిది రావడం చేత సూరీరావుగారికి గుమాస్తా అక్కర్లేకపోవడమూ నాకు పని తేలకపోవడమూ అన్నీ ఆలోచించాము వారూ నేనూను. యింటో వున్న మిషను తీసుగు వచ్చి పక్కగది అద్దికి పుచ్చుకుని దాల్లో పెట్టేను నేను దుకాణం, సాయిబు సగం వాటాకి చేరాడు. కొన్నాళ్ళకి యిద్దరు జీతగాళ్ళని పెట్టేము."

"నాతో వుమ్మడి వచ్చేక సాయిబు కూడా పని నేర్చుకున్నాడు. వక సంవత్సరం గడిచేటప్పటికి యెనిమిదివందలు మిగిల్చేడు సాయిబు. అవి పట్టుకుని అతను మద్రాసు వెళ్ళిపోయాడు. యింకో జీతగాణ్ణి వేసుకోవలసివచ్చింది నాకు."

"అప్పటికి యిరవైనాలుగో యేడూ నాకు. పెళ్ళికాలేదు. అప్పటిదాకా ఆధ్యానమే లేకపోయింది. సుబ్బారావుగారికి పెళ్ళివారు వచ్చారు. నాకు పెళ్ళిమీదకి బుద్ధి పోయింది. మా అమ్మతో చెప్పేను. ఆవిడ సూరీరావుగారి తల్లితో చెప్పింది."

"వారిలో వారు యేంమాట్లాడుకున్నారో నాకు తెలవదు. సూరీరావుగారూ, సుబ్బారావుగారూ భోంచేసి రాత్రి యెనిమిది గంటలవేళ వాకట్లో కూచున్నారు. అప్పటికి నేను వక కోటుగుడ్డ కత్తిరిస్తున్నాను. మాఅమ్మ వచ్చి నిన్ను పిలుస్తున్నారంది. యిద్దరమూ వెళ్ళేము."

"సూరీరావుగారు పడకకుర్చీ మీద కూర్చున్నారు. వారి తల్లీ, మాఅమ్మా సోఫా మీద కూర్చున్నారు. సూరీరావుగారి భార్యా, చెల్లెలూ తివాసీ మీద కూచున్నారు. సుబ్బారావుగారు జపాన్ చాపమీద చిఠా ఆవర్జాలు ముందు వేసుకుని కూర్చున్నారు. నేను సుబ్బారావుగారి దగ్గిరే కూర్చున్నాను."

"మీసొమ్ము మాదగ్గిర యెంత వుందండీ?" అని అడిగేరు సూరీరావుగారు. "నాకు తెలవదన్నాను. సంసారఖర్చులు పోగా మిగిలింది మీ చేతికే యిచ్చేస్తున్నాను. నాదగ్గిర లెక్కాపత్రమూ యేమీ లేవు. జ్ఞాపకం వుంచుకోవాలని గూడా నాకు తోచలేదు. అంతామీకే తెలుసున"న్నాను. సూరీరావుగారు "అలా అయితే యెలాగండీ? మేం హరిస్తే యేంచేస్తారూ?" అని యింకా యేమో అనబోయారు. "అలా అనకండ"న్నాను నేను. సూరీరావుగారు చెప్పగా సుబ్బారావుగారు "సీతారాముడు గారి కాతాని ఫాయిదాగాక మూడువేల రెండువందల పదకొండు రూపాయల జమ వుంద"న్నారు. "ఫాయిదా ఈరోజువరకు అయిదువందల పద్దానుగు రూపాయల తొమ్మిది పయిసలయింద"న్నారు. "దీనికి పెట్టుబడి యెంతండీ" అని సూరీరావుగారు అడగ్గా నేను మాట్లాళ్ళేకపోయాను. చూడగా మాఅమ్మ బ్రహ్మానందభరితురాలైవుంది.

"మీరు పురుషకారాన్ని బాగా చూపించారు. మీతో సహవాసం వచ్చేక నాకు గూడా చురుకు వచ్చింది. మీరు నాకు కుబేరుని వంటి స్నేహితులు. మీ అనుగ్రహం చేత మా వేంకటలక్ష్మికి తెలివితేటలు వచ్చాయి. మూడేళ్ళనుంచి

చదువు చెబుతున్నారు దానికి. మేం దమ్మిడీ యిచ్చిన పాపాన్ని పోలేదు. యివాళ మాఅమ్మ గురుదక్షిణ యిమ్మంటోంది. కనక దయవుంచి స్వీకరించాలి" అంటూ ఆయన చెల్లెల్ని దగ్గరికి పిలిచారు. ఆమె దగ్గిరకి వచ్చి నుంచుంది. నేను "అక్కర్లేదండీ, మీరు నాకు చేసిన వుపకారం అనంతమై వుంది. అదే నాకు గురుదక్షిణ. అంతకంటే మీవల్ల నేనేమీ పుచ్చుకోను" అన్నాను. వల్లకాదన్నారు వారు. యేమిస్తారో అనుకున్నాను. "రావే చెల్లీ" అని పిలిచి వారు వేంకటలక్ష్మి చేతిని నాచేతిలో వుంచి "మా బావయొక్క సలహాను పొందీ మీచెల్లెలి అంగీకారాన్ని పడసీ, మాఅమ్మగారి అనుజ్ఞను శిరసావహించీ, త్రికరణ శుద్ధిగా మాచెల్లెల్ని మీకు ఇస్తున్నాను. మా చెల్లెలికి మీకంటే మంచివరుడు దొరకడు. మీకు తగినంత కట్నం మేమివ్వలేము. నూటపదహార్లూ, వెండి చెంబులూ, వెండికంచమూ, పట్టుతాపితాలూ యిచ్చుకుంటాము. ఉభయఖర్చులూ నేనే భరిస్తాను. మీరేమీ నగలు పెట్టవద్దు. మీసొమ్ము నాలుగువేలకీ లోటు పూర్తిచేసి వ్యాపారంలో వేసి మీకు వాటా యిస్తున్నాను" అని చెప్పేరు. నాకు యేమీ తెలవలేదు. మాఅమ్మ గూడా మాట్లాళ్ళేకపోయింది."

"నావివాహం చాలా వైభవంగా అయింది. నావృత్తి గురువుని పెళ్ళికి పిలిచి గౌరవించాను. అతను బ్రహ్మానందపడ్డాడు."

"సూరీరావుగారూ, సుబ్బారావుగారూ బట్టలవ్యాపారం చూస్తున్నారు. నేను మిషను పని చూసుకుంటున్నాను. నాగది ఆకొట్టుకి చేరే వుండడం చేత మాకేమీ చిక్కుల్లేవు, అస్తమానూ మాట్లాడుకుంటూనే వుంటాం మేము."

"అన్ని ఖర్చులూ పోను నాకిప్పుడు నెలకి నూరురూపాయలకు తక్కువలేకుండా మిగులుతున్నాయి. భోజనం మేమంతా కలిసే చేస్తున్నాము. మూడు కుటుంబాలు ఏకకుటుంబం అయిపోయాయి."

"నాపెళ్ళయి సంవత్సరం అయింది. మిగిలిందంతా సూరీరావుగారి చేతికే యిచ్చేస్తున్నాను నేను. భారం అంతా వారిమీదే వేశేశాను నేను. ఇప్పటికి వేంకటలక్ష్మికి యెనిమిదివందల రూపాయల నగలు చేయించారు వారు."

"నగరీయసంఘంలో వుంటే నేనిప్పుడిలా వుందునా? జీతం నలభై రూపాయలకి మించి వుండదు యిప్పటికి. వారు నన్ను తొలగించి వేయడంవల్ల నాకేమీ నష్టం కలగలేదు. పైగా బంగారబ్బొమ్మలాంటి వెంకటలక్ష్మి నాకు లభించింది."

"మొదట వొకళ్ళ చేతికింద చేయిపెట్టిన నేను యిప్పుడు స్వేచ్ఛావృత్తి నవలంబించడం చేత నలుగుర్ని పోషిస్తున్నానిప్పుడు. వక గుమాస్తా ముగ్గురు దర్జీలూను. గుమాస్తా పొరుగూళ్ళ కాతాలు సంపాదించి తెస్తూ వుంటాడు."

❀ ❀ ❀